14)శుద్ధవసంతం

ప॥ చీ చీ వివేకమా చిత్తపువికారమా । యేచి హరి గొలువక హీనుడాయ జీవుడు ॥

చ॥ బతికేనంటా బోయి పయిడి వుచ్చుక తన- । పతియవసరముల బ్రాణమిచ్చీని ।
బతు కందులోన నేది పసిడి యెక్కడ నుండు । గతిహరి గొలువక కట్టువడె జీవుడు ॥

చ॥ దొడ్డవాడనయ్యేనని దొరల గొలిచి వారి- । కడ్డము నిడుపు మొక్కు నతిదీనుడై ।
దొడ్డతన మేది యందు దొర యాడనున్నవాడు । వొడ్డి హరి గొలువక వోడుపడె జీవుడు ॥

చ చావనేల నోవనేల సారె గిందుపడనేల । యీావల శ్రీవేంకటేశు డింట నున్నాడు ।
దేవు డాతడే నేడు తెలిసి కొలిచేగాని । భావించ కిన్నాళ్ళదాకా భ్రమ బడె జీవుడు ॥